# UTF

# ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి

## ఆగస్ట్ 20,21 ధర్నాల్లో పాల్గొనండి

గత సంవత్సరకాలంగా ఉపాధ్యాయుల సమస్యలపై పలు దఫాలుగా రాష్ట్ర ప్రభుత్వంతో యుటియఫ్‌గా, ఫ్యాప్టోగా ప్రాతినిధ్యాలు, పోరాటాలు నిర్వహించాము. అయినా సమస్యలు పరిష్కారం కాలేదు. జెఏసి ఆధ్వర్యంలో మంచి పిఆర్‌సి తెచ్చుకోగలిగాం. కాని ఇప్పటికి పిఆర్‌సి మొత్తంగా ఆమోదం కాకపోవడం వలన ప్రతీది క్యాబినెట్‌కు పెట్టాలనడంతో ఏ జి.ఓ. ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉంది. అలవెన్సులు, అర్ధ జీతపు సెలవు ఎన్‌క్యాష్‌మెంట్, దహన ఖర్చుల పెంపు, గ్రాట్యూటీ పెంపు, శిశు సంరక్షణ సెలవు, జూలై 2013 తరువాత రిటైరైన పెన్షనర్ల ఫిక్సేషన్ తదితర అంశాలపై ఉత్తర్వులు రావల్సిఉంది. మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించకపోగా మున్సిపల్ పాఠశాలల్లో కార్పొరేట్ వారి జోక్యం పెరుగుతోంది. ఎయిడెడ్ టీచర్లకు 3, 4 నెలల జీతాలు లేవు. పిఆర్‌సి అమలుకు బడ్జెట్ లేదు. ప్రమోషన్‌లు పెండింగ్‌లో వున్నాయి. పండితుల, పిఇటిల అప్‌గ్రేడేషన్ అందని ద్రాక్ష అయింది. ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా సమస్య మళ్ళీ మొదటికొస్తోంది.

సర్వీస్ రూల్స్ ఫైల్ ఢిల్లీ వెళ్ళినా పెద్ద మార్పులేదు. దశాబ్దాలుగా ఎంఇఓ, డివైఇఓలు లేక పాఠశాల వ్యవస్థ దిక్కులేనిదయ్యింది. లెక్చరర్లు లేక డైట్‌లు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయి. కేవలం రూ.398/- జీతంతో పని చేసిన స్పెషల్ టీచర్ల సర్వీసుకు నోషనల్ ఇంక్రిమెంట్లు, 1991 తర్వాత చేరిన వారికి ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ జిఓలు ఇవ్వ లేదు. ఏజెన్సీ ఏరియాలో పనిచేస్తున్న గిరిజనేతర ఉపాధ్యాయులకు బదిలీలు అనుమతించుటలేదు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో టీచర్ల కొరత అలాగే వుంది. సిఆర్‌టిలను నియమించడంలో క్రొత్త సమస్యలు సృష్టించారు.

ఉపాధ్యాయుల సమస్యలే కాదు, పాఠశాలల సమస్యలు అనేకం ఉన్నాయి. కంప్యూటర్ టీచర్లులేక కంప్యూటర్‌లు మూతపడ్డాయి. టాయిలెట్స్, మంచినీరు, ప్రహరీగోడలు లేని పాఠశాలలు అనేకం ఉన్నాయి. నాన్ టీచింగ్ స్టాఫ్ లేక ఉన్నత పాఠశాలల్లో టీచర్లే రికార్డులు వ్రాయడం, బిల్లులు చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికి అందరికి టెక్స్ట్‌బుక్స్ అందలేదు, ఉపాధ్యాయ ఖాళీలు 15వేలుపైగా ఉన్నాయి. డిఎస్‌సి జరిగినా నియామకాల్లేవు, అదనపు సబ్జెక్టుల బోధనకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్ నియామకాలు జరుగలేదు.

ఎన్ని సమస్యలున్నా పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఉపాధ్యాయుల్ని అభినందించాల్సిన పాలకులు కార్పొరేట్ పాఠశాలలే మెరుగుగా ఉన్నాయని ప్రకటనలు చేయడం, కార్పొరేట్‌లను పరోక్షంగా ప్రోత్సహించడమే. స్పష్టమైన పరీక్షా విధానమే మనకి లేదు. టైంటేబుల్ సర్దుబాటు చేయబోయి పాఠశాలల్లో సైన్స్, గణితం టీచర్ల మధ్య తగాదాలు తెచ్చారు.

ఎప్పుడూ ప్రాతినిధ్యం చేసినా అధికారులు చేస్తాం అంటారు, మంత్రిగారు చూస్తాం అంటారు. కాని ఏళ్ళతరబడి సమస్యలు అలాగే ఉన్నాయి. ఈ దశలో ఆగస్ట్ 8,9 తేదీల్లో జరిగిన యుటియఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రెండు దశల పోరాటం ప్రకటించింది.

- ఆగస్ట్ 20,21 తేదీల్లో జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు
- సెప్టెంబర్ 3వ తేదీన విజయవాడలో మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించింది.

**సమస్యలు :**

1. ఎ) ఎయిడెడ్ ఉపాధ్యాయుల జీతాలు, పిఆర్‌సి, అరియర్స్ గ్రాంట్ విడుదల చేయాలి. 84 జి.ఓ అమలుకు బడ్జెట్ ఆపరేషన్ ఉత్తర్వులు విడుదల చేయాలి.
   బి) ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రమోషన్‌లు వెంటనే ఇవ్వాలి. ఖాళీలను భర్తీ చేయాలి.
   సి) ఎయిడెడ్ ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు, ఏపిజిఎల్ఐ వర్తింపజేయాలి.
   డి) 37/2005 యాక్ట్ రికవరీలు నిలుపుదల చేయాలి.
2. ఎ) మున్సిపల్ ఉపాధ్యాయల సర్వీస్ రూల్స్ ప్రకటించాలి.
   బి) మున్సిపల్ ఉపాధ్యాయుల జిపిఎఫ్, ఎల్‌టిసి సౌకర్యం కల్పించాలి.
   సి) మున్సిపల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు గెజిటెడ్ హోదా కల్పించాలి.
   డి) మున్సిపల్ టీచర్లకు కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు, ప్రతినెలా ప్రమోషన్‌లు ఇవ్వాలి.
   ఇ) మున్సిపల్ పాఠశాలల్లో కార్పొరేట్ జోక్యం విరమించుకోవాలి.
3. ఎ) ఉపాధ్యాయుల సర్వీస్‌రూల్స్ సమస్య పరిష్కరించాలి. ఎంఇఓ, డివైఇఓ, డైట్ లెక్చరర్లు, జె.ఎల్ పోస్టులు భర్తీ చేయాలి.
4. ఎ) పిఆర్‌సి రిపోర్టు మొత్తంగా ఆమోదించి మిగిలిన జిఓలు ఇవ్వాలి.
   బి) పిఆర్‌సి ఫిక్సేషన్‌లో 2008 హామీ పత్రాల వారికి వేతన రక్షణ కల్పించాలి.
5. భాషా పండితులు, పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలి.
6. 398 స్పెషల్ టీచర్ల సర్వీసుకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి. 1990 తర్వాత చేరినవారికి 119 జిఓ అమలు చేయాలి.
7. ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న గిరిజనేతర ఉపాధ్యాయులను మైదాన ప్రాంత బదిలీకి అనుమతించాలి. గిరిజన సంక్షేమ పాఠశాలల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి. సిఆర్‌టిల నియామకంలో సమస్యలు పరిష్కరించాలి.
8. ఎ) డిఎస్‌సి-2014 నియామకాలు వెంటనే చేయాలి.
   బి) పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి. ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ ఫ్యాకల్టీని నియమించాలి.
   సి) ఉన్నత పాఠశాలల్లో బోధనేతర సిబ్బందిని, వాచ్‌మెన్‌తో సహా నియమించాలి.
9. పాఠశాల పనిదినాల్లో ఏలాంటి ట్రైనింగ్‌లు, బోధనేతర కార్యక్రమాలు నిర్వహించరాదు.
10. స్పష్టమైన పరీక్షా విధానం ప్రకటించాలి. టైంటేబుల్ సవరణల్లో వచ్చిన విభేదాలు పరిష్కరించాలి.

**ఈ ధర్నాల్లో ఉపాధ్యాయులందరు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.**

## ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్

తేది:11.08.2015

...................... జిల్లా కమిటీ